క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు

బిక్కవోలు: గ్రామంలోని మునసుబు పేట ఏరియాలో కొలువైన ఉన్న సత్తెమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. బుధవారం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దాతలు సహకారంతో సుమారు రూ.15 లక్షలతో ఆలయం నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కలు సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరికరాల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని వివిధ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (ప్రతిభావంతులు) ప్రభుత్వం అందించిన పరికరాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారు. బుధవారం బలభద్రపురం గ్రామంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన 48 మంది దివ్యాంగులకు నాలుగు చక్రాల కుర్చీలు 9, టీఎల్ఎం కిట్లు 11, వినికిడి యంత్రాలు 34, రోలాటర్సు పరికరాలు 8, బ్రెయిలీ కిట్లు 2, మూడు చక్రాల సైకిళ్లు 2 అందించారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల నిర్వహణను పరిశీలించిన వీసీ


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరుగుతున్న బీఈడీ పరీక్షల నిర్వహణను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం పరిశీలించారు. క్యాంపస్‌తోపాటు అనుబంధ కళాశాలలో బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మే 3 వరకు జరుగుతాయన్నారు.

చిత్రలేఖనం పోటీలు


వేసిన చిత్రాలతో విద్యార్థులు

రాజానగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా బుధవారం చిత్రలేఖనంలో పోటీలు జరిగాయి. అనంతరం కథలు చెప్పడం, చదివించడంపై అవగాహన కలిగించారు. అలాగే ఇంగ్లిష్ స్పోకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై రెడ్డి ప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

అక్షరాలు కావవి అస్త్రాలు

'నన్నయ'లో శ్రీశ్రీ జయంతి


శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సిబ్బంది

రాజానగరం: 'కుదిరితే పరిగెత్తు, లేకపోతే నడువు, అదీ చేతకాకపోతే పాకుతూ పో, అంతేగానీ ఒకేచోట అలా కదలకుండా ఉండిపోవద్దు' అంటూ మహాకవి శ్రీశ్రీ సమాజాన్ని చైతన్యపరుస్తూ రాసిన అక్షరాలు అస్త్రాలుగా పని చేస్తున్నాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం పోరాడుదాం

కోరుకొండ: కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దు కోసం మే ఒకటో తేదీన చిత్తూరు జిల్లాలో జరగనున్న చైతన్యయాత్రలో పాల్గొనాలని ఏపీజీఈఏ కోరుకొండ అధ్యక్షుడు బీకే మల్లికార్జునరావు అన్నారు. బుధవారం కోరుకొండలో సంస్థ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. సభ్యులంతా చైతన్య యాత్రలో పాల్గొనాలని సమావేశంలో తీర్మానించారు. సీపీఎస్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దోపిడీకి గురవుతున్నారన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డీఏలను సాధించడానికి సంసిద్ధం కావాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో సంస్థ కార్యదర్శి డి.భగవాన్‌దాస్, సభ్యులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దళారుల దందా

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన విక్రయాలు
- దళారులకే అమ్మకాలు
- రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం


మునగాలలో కళ్లంలో ఉన్న ధాన్యం బస్తాలు

కోరుకొండ: మెట్టప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో రబీ ధాన్యం కొనుగోళ్లు 75 శాతం పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల కారణంగా ధాన్యం కొనుగోలులో దళారులు రాజ్యమేలుతున్నారు. జిల్లాలో రబీ విస్తీర్ణం 58,586 హెక్టార్లు ఉండగా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 18,350 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం ఉంది. ప్రస్తుతం రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ఇప్పటి వరకూ 32 వేలమెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో దళారులు దందా చేస్తున్నారు. వారు ఎంత ధర నిర్ణయిస్తే అంతకే అమ్మకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం తుపాను కారణంగా అమ్మకాలు నిలిచిపోయాయి.

దళారులు నిర్ణయించిన ధరకే..

కోరుకొండ మండలంలోఎంటీయూ 1121, 1156, ఆర్ఎన్ఆర్ 15048 వరిరకాలను సాగు చేశారు. మెట్టప్రాంత రైతులు రబీ సీజన్ సాగుకు అనువుగా ఉండడంతో 15048ని ఎక్కువ మంది సాగు చేశారు. సన్నాలుగా పిలిచే ఈ రకం గ్రేడు ఏగా ఉంది. కాగా మిగిలినవన్నీ సాధారణ రకాలుగా ఉన్నాయి. రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాల్సిన రెస్ మిల్లుల యజమానులు ఈ సారి దళారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు వాతావరణం అనుకూలించకపోవడంతో వర్షాలు కురుస్తున్న తరుణంలో దళారులు నిర్ణయించిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. ఏ గ్రేడు రకానికి క్వింటాల్ రూ.2,320 ధర ఉండగా, తేమ కారణంగా ధాన్యాన్ని రూ.1550 నుంచి రూ.1700 ధర ఇస్తున్నారు. ఇక 75 కేజీల ధాన్యం రూ.1300 నుంచి రూ.1,500 కొనుగోలు చేస్తున్నారు. తేమ పేరుతో వ్యాపారుల రైతులను మోసం చేస్తున్నారు. కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో 26 రైతు సేవా కేంద్రాలున్నాయి. అయినా దళారులే చెప్పినట్టే జరుగుతోంది.


శ్రీరంగపట్నంలో ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు


బూరుగుపూడిలో మూసి ఉన్న రైతు సేవా కేంద్రం

వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో..



కోరుకొండ మండలంలో 22 వేల మెట్రిక్ టన్నులు వరి పంట పండింది. కానీ మిల్లర్లు కేవలం 4 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. దీంతో పంటను దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,320 ధరలుండగా, రూ.1,600 నుంచి రూ.1750లకు అమ్ముకోవాల్సివస్తోంది. తేమ కారణాలతో తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది.

– అత్తిలి రాంప్రసాద్, రైతు, శ్రీరంగపట్నం

నచ్చిన పద్ధతిలో అమ్మకాలు



రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతు సేవా కేంద్రాల ద్వారా జరుగుతోంది. మిల్లర్లు 4 వేల మెట్రిక్ టన్నులు కొంటున్నారు. దీంతో రైతులు వారికి అనుకూలమైన పద్ధతుల్లో అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం వెల్లడించిన విధంగా సాధారణ రకానికి క్వింటాళ్లు ధర రూ.2,300, ఏ గ్రేడు రకానికి రూ. 2,320 ధర ఉంది.

–ఏ గౌరీదేవి, వ్యవసాయశాఖ, మండలాధికారి

పీఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను ప్రజలు అవగాహన పెంచుకుని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎం అరుణ, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ శ్రీకృష్ణమూర్తి ఏఈ వీరవెంకటసత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా యానిమేటర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించి సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోడానికి ప్రభుత్వం రూ.78వేల వరకు రాయితీ అందిస్తుందన్నారు. డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి నుంచి తక్కువ వడ్డీకి సొమ్ము చెల్లించేలా అవకాశం ఉందన్నారు. దీనిపై బ్యాంకు రుణాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. ఒక కిలో వాట్‌కు 100 నుంచి 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ పథకం వినియోగించుకోవడంతో విద్యుత్ బిల్లులు పూర్తిగా తగ్గించుకోవడమే కాకుండా తిరిగి ప్రభుత్వానికి కరెంటును విక్రయించుకోవచ్చన్నారు. ఒక సుస్థిరమైన అభివృద్ధి అంటే ప్రకృతి వనరులను మితంగా వాడుకుంటూ భవిష్యత్తు తరాల వారికి వాటిని మిగల్చడమే సుస్థిరా అభివృద్ధి లక్ష్యాలు నెరవేర్చడమన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వెంకటేశ్వరరావు

రంగంపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కృషి చేయాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు కోరారు. వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారందరూ వర్క్‌ను కొనసాగిస్తూ ఆర్థికంగా లాభపడాలన్నారు. ఈ రోజుల్లో బోటిక్‌కు మంచి డిమాండ్ ఉందని దాని ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు తమ ఫౌండేషన్ అందుబాటులో ఉంటుందని ఏ గ్రామంలో నైనా శిక్షణ అందిస్తామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని దీంతో సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు సమాధానం చెప్పలేకే అసత్య ప్రకటనలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శ


ఇల్లు కోల్పోయిన బాధితుడు అచ్చిరాజుతో కలిసి అనపర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు సమాధానం చెప్పలేక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన అనుచరులతో అసత్య ప్రకటనలు చేయిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి బుధవారం మాట్లాడారు. గత వారం రోజులుగా పగలు ఎండలో, రాత్రులు చీకట్లో గడుపుతూ తీవ్ర ఆవేదనకు గురై రోధిస్తున్న బాధితులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించలేక దిక్కుతోచని స్థితిలో మరోసారి డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పెదపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పుట్టా గంగాధర్ చౌదరితో అసత్యాల ప్రకటనలు చేయించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గంగాధర్ చౌదరి సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కల్యాణ మండపం ముసుగులో పలు అక్రమాలకు పాల్పడ్డారంటూ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. అలాగే పెద్దాడ గ్రామంలో పేకాట క్లబ్‌ను గంగాధర్ ఆయన బంధువు నిర్వహణ సమయంలో పోలీసులకు పట్టుబడితే ఆ కేసు మాఫీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారంటూ ఆరోపించారు. మద్యం షాపుల నిర్వహణలో ఎమ్మెల్యేతోపాటు గంగాధర్ చౌదరి వాటాల కోసం ప్రయత్నం చేయలేదా అంటూ ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బూత్ ఏజెంట్లకు ఇవ్వాల్సిన నగదు వారికి ఇవ్వకుండా మీరు, మీ కొత్త పార్టనర్ కలిసి దోచేశారంటూ ఆరోపించారు. తనపై వ్యక్తిగత విషయాలకు పాల్పడితే తగిన రీతిలో బుద్ధి చెబుతానని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాగే దోమాడలో ఇళ్లు కోల్పోయిన ఎస్.అచ్చిరాజు అనే బాధితుడు ఇల్లు కూల్చే సమయంలో కొంత సమయం ఇవ్వాలని, సామాన్లు భద్రపరుచుకుంటామని మిమ్మల్ని కోరినప్పటికి కనీస మానవత్వం లేకుండా స్పందించలేదని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దుయ్యబట్టారు.

జూన్‌లో జీజీయూలో వికసిత్ భారత్ జాతీయ సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో జూన్ 28, 29వ తేదీల్లో 'వికసిత్ భారత్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణల వినియోగం' అనే అంశంపై జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక లోగో, వెబ్ సైట్‌తో కూడిన పోస్టర్‌ని జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) బుధవారం ఆవిష్కరించారు. 2047 నాటికి లక్ష్యం మేరకు భారత దేశం ప్రగతిని సాధించాలంటే దేశంలో ఉన్న జీజీయూ వంటి విద్యా సంస్థలు ప్రభావవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ముందుండాలన్నారు. అందుకు ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుందని భావిస్తున్నామన్నారు. పరిశోధన, ఆవిష్కరణల సలహాదారు ప్రొఫెసర్ సిశిర్ సాహు మాట్లాడుతూ ప్రభుత్వ, పరిశ్రమ, విద్యారంగాల మధ్య సహకారంతో కీలక పరిష్కారాలను కలిసి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.విజయభాస్కరరాజు, కేబీఆర్ వర్మ, పీఎంఎంఎస్ శర్మ, శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

5న చలో దోమాడ


శిబిరంలో కూర్చున్న దళిత ప్రజా సంఘాలు నాయకులు

పెదపూడి: దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం కోసం ఈ నెల 5వ తేదీ నిర్వహించే చలో దోమాడ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరు హాజరై జయప్రదం చేయాలని ఆంధ్రా మాలమహానాడు అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, దళిత ప్రజాశక్తి రాష్ట్ర అధ్యక్షుడు మురారి రవి, జై భీమ్ భారతపార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, జైభీమ్ మలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టి.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. వారు బుధవారం దోమాడలో బాధితులు నిర్వహిస్తున్న నిరవధిక దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. జీవించే హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. దౌర్జన్యంగా గృహాలు కూల్చివేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే 5న పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ, ఆంధ్రమాలమహానాడు యువజన సంఘం అధ్యక్షుడు ఉల్లం రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జి లింగం నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయండి

పెదపూడి: గ్రామంలో గురువారం నిర్వహించే మే డే కార్యక్రమానికి పంచాయతీ కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాగుల రఘువులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ పిలుపునిచ్చారు. వారు జి.మామిడాడలో బుధవారం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎర్ర జెండాలు ఎగురవేయాలన్నారు.

నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా అనపర్తికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి.

గాలీవాన బీభత్సం


చంద్రేడులో సోమవారం సాయంత్రం దట్టంగా అలముకున్న కారు మబ్బులు

- భారీగా కురిసిన వర్షం
- స్తంభించిన జనజీవనం
- కూరగాయలు, పామాయిల్ పంటలకు లాభం
- మామిడి తోటల రైతులకు నష్టం


రంగంపేటలో గాలివానకు విరిగిపోయిన 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు

రంగంపేట: మండలంలో బుధవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో ఉక్కపోతకు గురైన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో పిల్లలు, పెద్దలు సేదతీరారు. కారు మబ్బులు కారణంగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కొద్దిసేపటికే ఈదురు గాలులతో కూడిన వర్షం మొదలైంది. గాలులతో కూడిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పనులపై బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులు కారణంగా విద్యుత్ తీగలు, స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. మంగళవారం రాత్రి పల్లకడియం నుంచి రంగంపేట వచ్చే 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో తెల్లవార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం విద్యుత్ శాఖ ఏడీఈ నిరంజన్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది లైన్లకు మరమ్మతులు చేపట్టారు. కాగా బుధవారం సాయంత్రం మళ్లీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షంతో పామాయిల్, నిమ్మ, జీడి మామిడి, కూరగాయ పంటలకు మేలు చేయగా మరో పక్క మండలంలో పలు చోట్ల మామిడి కాయలు నేలరాలిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు మామిడి రైతులకు నష్టం వాటిల్లింది.

మారుతున్న ఆహార అలవాట్లే క్యాన్సర్‌కు కారణం

న్యాయవాదులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


డాక్టర్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న ఆహారపు అలవాట్లు, కాలుష్యం, కల్తీలు, మానసిక ఒత్తిడి వంటివి క్యాన్సర్ పెరగడానికి కారణం అవుతున్నాయని చంద్రకళ సూపర్ స్పెషాలిటీ డాక్టర్ పట్నాల విశ్వనాథ్ పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం బార్ అసోషియేషన్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తిస్తే చాలామంది ప్రాణాలు కాపాడ వచ్చునన్నారు. ధూమపానం, ఆల్కహాలు వంటివి చాలా రకాల క్యాన్సర్‌కి కారణాలవుతున్నాయన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని, దీనిని చిన్న వయసులో 9 సంవత్సరాల లోపు ఇవ్వడం వలన వంద శాతం కచ్చితంగా ఫలితాలు ఉంటాయన్నారు. సెల్‌ఫోన్ రేడియేషన్ కూడా బ్రెయిన్ క్యాన్సర్‌కి కారణమవుతుందని రిపోర్టులు తెలియజేస్తున్నాయన్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం జరగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామ గుప్త, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాద్రి శాస్త్రి క్లబ్ కార్యదర్శి వెన్న కుమారస్వామి, ట్రెజర్ రాఘవరావు, అడ్మిన్ గ్రంధి వసంత కుమారి, బార్ కార్యదర్శి బి.రమేష్ , బార్ ట్రెజర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోరుకున్న శ్రీశ్రీ


కడియం శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ జయంతి

కడియం: సమాజంలో అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతిని తన సాహిత్యం రూపంలో శ్రీశ్రీ కోరుకున్నారని చేళ్లపిళ్ల వేంకట శాస్త్ర కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కడియం నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, రైతు నాయకులు బోణం సత్యనారాయణ, కళ్యాణం సూరిబాబు, లంకేశ్వరరావు, భాస్కరరావు, తాతబ్బాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కానరాని అక్షయ తృతీయ సందడి

వెలవెలబోయిన బంగారు ఆభరణాల దుకాణాలు

కోరుకొండ: అక్షయ తృతీయ సందడి ఎక్కడా కానరాలేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే బంగారు ఆభరణాల దుకాణాలన్నీ కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. మండల కేంద్రమైన కోరుకొండలో 12 దుకాణాలున్నాయి. ధరలు పెరగడంతో కొనుగోలుదారులు పెద్దగా కొనడం లేదు. దీంతో వ్యాపారులందరూ ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదని వర్తక సంఘం నాయకులు చిన బాబు తెలిపారు. బంగారం ధరలు పెరగడం కూడా కారణంగా చెబుతున్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన


లైంగిక వేధింపులు నివారణపై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై స్థానిక ఆనం కళాకేంద్రంలో జిల్లా విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎన్జీవోలకు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ఆనం కళా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్ హాజరై పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు వాటిని ఏ విధంగా అరికట్టాలి, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు మన అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల, జిల్లా విద్యాశాఖ అధికారి కే వాసుదేవరావు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇంద్రజ, డైస్ మేనేజర్ సతీష్, డైస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.